క్లుప్తంగా

అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని పలు కూడళ్లలో ఉంటున్న అనాథలు, అభాగ్యులకు బుధవారం అన్నదానం చేస్తూ ఆహార పొట్లాలను అందజేశారు. హైదరాబాదుకు చెందిన మునిరామచంద్రారావు జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానికుడైన ఉదయ్‌భాస్కర్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దాతలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు ఈనెల 28వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ 31 రోజులు, బ్యూటీపార్లర్‌లో 35 రోజులు శిక్షణ ఇస్తామన్నారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ 11వ ఉమ్మడి కడప జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని ఆర్ఎస్‌యూ నగర అధ్యక్షుడు గురుమోహన్ పిలుపునిచ్చాడు. బుధవారం కడప నగరంలోని స్థానిక ప్రభుత్వ బీసీ వసతి గృహంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్‌యూ 11 వ ఉమ్మడి జిల్లా మహాసభలు రైల్వే కోడూరు వేదికగా ఈనెల 25వ తేదీ ఏపీ ఎన్జీవోలో జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభల్లో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, పూర్తిస్థాయిలో తల్లికి వందనం విడుదల చేయాలి.. ఇంకా పలు అంశాలపై ఈ మహాసభ వేదికగా చర్చిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయకులు రాఘవ, ఛత్రపతి, సందీప్,లింగయ్య పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామాగ్రి అందుకున్న చిన్నారులతో దాతలు, అవోపా మహిళా విభాగ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్/కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని వాటర్‌గండి యూపీ స్కూలులో అవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు సాధు కృష్ణవేణి ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలకలు, బలపాలు, నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, ఎరైజర్లును దాత ముచ్చెర్ల వెంకట సుబ్బయ్య, కడప ఎంఈఓ గంగిరెడ్డిల సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పుష్పరాజు, అనుపమ, శ్రీలత, విజయ, అవోపా ఉపాధ్యక్షురాలు కల్పనాదేవి, సెక్రటరీ వసంతకుమారి, స్రవంతి, ఈసీ మెంబర్లు సత్యప్రసాద్, సాధు జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీ కార్డులు పంపిణీ చేస్తాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆప్కో రాయితీ కార్డులను పంపిణీ చేయనున్నామని ఆప్కో మండల వాణిజ్య అధికారి బి.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఆప్కో మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ రేఖారాణి సూచనల మేరకు రాయితీ కార్డులను పంపిణీ చేయనున్నామన్నారు. 30 శాతం రాయితీతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కడప నగరంలో ఆప్కో చేనేత వస్త్రాలయం, కలెక్టరేట్ ప్రాంగణంలో, పులివెందులలోని జయమ్మ మున్సిపల్ కాంప్లెక్స్ రూము నెంబరు 11, 12లలో, రాయచోటిలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోగల ఆప్కో విక్రయశాలలో, రైల్వేకోడూరులోని చిట్వేలిరోడ్డులోగల ఆప్కో విక్రయశాల, రాజంపేటలోని పాతబస్టాండు మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న ఆప్కో షోరూంలలో రాయితీపై వస్త్రాలను అందజేస్తారన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన ఓటీ అలవెన్సులు, నైట్ అవుట్ అలవెన్సులు ఇవ్వకుండా ఉద్యోగుల శ్రమ దోపిడీ చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు సృష్టించడం తగదని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో సెక్రటరీ సగినాల శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు బుధవారం కడప డిపో మేనేజర్‌కు సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31, ఆగస్టు 1న ఎర్రబ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ నిర్వహించనున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో చేపట్టిన ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

అప్‌గ్రేడ్ సరే.. వసతులేవీ..?



గౌస్‌నగర్ ఉర్దూ హైస్కూల్



బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు



ఎత్తు తక్కువగా ఉన్న పాఠశాల ప్రహరీ

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- అరకొరగా మౌలిక వసతులు.. అవస్థల్లో విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హడావుడిగా పలు పాఠశాలలను హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేసింది. అయితే అందుకు తగ్గ వసతులను మాత్రం కల్పించలేదు. దీంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు. దీంతోపాటు ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. కడప నగరంలోని గౌస్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ యూపీ స్కూల్‌ను ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్(ఉర్దూ)గా అప్‌గ్రేడ్ చేశారు. అయితే సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కడప నగరంలో అప్‌గ్రేడ్ అయిన చాలా పాఠశాలలది ఇదే పరిస్థితి.

1 నుంచి 5 వరకు ఇద్దరే ఉపాధ్యాయులు..

గౌస్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్(ఉర్దూ)లో 1 నుంచి 5వ తరగతి వరకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఐదు మంది ఎస్‌జీటీలు, ఒక పీఎస్ ప్రధానోపాధ్యాయుడు ఉండాలి. కానీ ప్రస్తుతం కేవలం ఒక ఎస్‌జీటీ, పీఎస్ హెచ్‌ఎం మాత్రమే ఉన్నారు. దీంతో విద్యార్థుల బోధన కుంటుపడుతోంది.

అప్‌గ్రేడ్ హైస్కూల్లో...

అప్‌గ్రేడ్ అయిన్ హైస్కూల్లో సబ్జెక్టు టీచర్లు ఉన్నప్పటికీ ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతోపాటు ఇక్కడ పనిచేసే తెలుగు ఉపాధ్యాయు డిని డిప్యూటేషన్ పైన నగరపాలక ప్రధాన ఉర్దూ పాఠశాలకు పంపడంతో ఆ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. దీంతోపాటు ఒక రికార్డు అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి.

బోధన కుంటు..

విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందాలంటే తగినంతమంది ఉపాధ్యాయులు ఉండాల్సిన అవసరం ఉంది. కానీ ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. దీంతో విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

భద్రత అంతంతే...

పాఠశాలలో భద్రత సమస్య వేధిస్తోంది. పాఠశాలకు ఉన్న ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో రాత్రి పూట ఆకతాయిలు పాఠశాలలోకి ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పిల్లలు తెలిపారు. దీంతోపాటు కొందరు ఆకతాయిలు పాఠశాల ప్రాంగణంలోకి రాళ్లు విసరడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని వారు తెలిపారు. దీంతోపాటు పాఠశాలలో రికార్డులతో పాటు ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్స్ ఉన్నాయి. వీటికి కూడా భద్రత కరువైంది. ఇక పర్నీచర్‌గానీ, వసతులు కానీ లేవని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాలలో చెదలు సమస్య వేధిస్తోందని తెలిపారు.

మరుగుదొడ్ల సమస్య...

ప్రాథమిక, ఉన్నత పాఠశాలకు కలిసి 222 మంది విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో కేవలం ఆరు మూత్రశాలలు, మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉండటంతో అటు పిల్లలు, ఇటు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడం సంతోషం. అందుకు తగ్గట్టుగా వసతులు కల్పించాలి. 222 మంది విద్యార్థులంటే కేవలం ఆరు బాత్‌రూములు, మూడు లెట్రిన్స్ మాత్రమే ఉన్నాయి. దీంతో ఇటు పిల్లలు, ఇటు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి అదనపు మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి.

– సయ్యద్ సలీమూన్ , ఎస్‌ఎంసీ చైర్మెన్

సమస్యలు పరిష్కరించాలి



గౌస్‌నగర్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉన్న సమస్యలను అధికారులు, ప్రభుత్వం పరష్కరించాలి. పాఠశాలకు నిర్మించిన ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో పాఠశాలకు భద్రత కరువైంది. ఆ ప్రహరీని ఎత్తు పెండటంతోపాటు మౌలిక సదుపాయాలను కల్పించాలి. దీంతోపాటు మధ్యాహ్న భోజనానికి వచ్చే సామాగ్రిని నిల్వ చేసుకునే వసతి కూడా సరిగా లేదు. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి.

– లయన్ పటాన్ ఖాదర్‌బాష, ముస్లిం మైనార్టీ నాయకుడు, గౌస్‌నగర్, కడప

వాలంటీర్లను ఏర్పాటు చేయాలి



గౌస్‌నగర్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలను ఇటీవల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. అయితే ప్రాథమిక పాఠశాలకు ఒక ఎస్‌జీటీ, ఒక పీఎస్ హెచ్‌ఎం మాత్రమే ఉన్నారు. దీంతో ఇతర తరగతుల బోధనకు ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించే వరకు వాలంటీర్లను ఏర్పాటు చేస్తే బోధనకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

– ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, గౌస్‌నగర్ ఉర్దూ హైస్కూల్

నిబంధనలు పాటించని స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్–2 అనిల్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలా పాఠశాలలు కమర్షియల్ అపార్టుమెంట్స్‌లో ఏర్పాటు చేసుకుని పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు. వాటికి ఎటువంటి పార్కింగ్‌ప్లేస్, ఫైర్ సేఫ్టీ, ప్లేగ్రౌండ్ లేకుండా జన నివాస ప్రాంతాల్లో పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు. ఏదైనా ప్రమాదాలు జరిగినా రక్షించే పరిస్థితి లేదన్నారు. జమ్మలమడుగు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల పరిస్థితి ఇదేనన్నారు. అదేవిధంగా ఐఐటి, నీట్ అని పెద్ద పెద్ద బ్యానర్లు వేసుకుని తరగతులు బోధిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర లక్షల రూపాయలు అదనంగా వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు.

సన్మానం

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు, ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షులు కల్లూరి చెంగయ్యను మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మెన్ పులి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన దళిత నాయకులు ఘనంగా సన్మానించారు. ఎస్సీ విభాగం జిల్లా పరిశీలకులుగా నియమితులవడం పట్ల అభినందనలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బూసిపాటి కిశోర్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు త్యాగరాజు, ఎం. సుబ్బరాయుడు, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, రవి పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేసిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కేఓఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ లిఖితారెడ్డి, ప్రిన్సిపాల్ లావణ్య, బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్‌లు పిలుపునిచ్చారు. బుధవారం వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల స్వచ్ఛంద సంస్థల సంయుక్తాధ్వర్యంలో నగర శివార్లలోని కేఓఆర్ఎం కళాశాలలో జేబీవీఎస్ ది ప్రిజర్వు సేవా సమితి రెండవ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థినిలు పాల్గొని రక్తదానం చేశారు. సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్, కళాశాల యాజమాన్యం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ తులసికృష్ణ, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

సింహాద్రిపురం : చీనీ తోటలో సస్యరక్షణ చర్యలు చేపడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు తెలిపారు. బుధవారం మండలంలోని హిమకుంట్ల గ్రామంలో చీనీ తోటలలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై చీనీ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీ తోటలలో నీరు అధికంగా ఉండటంవల్ల తేమ ఆరకపోవడంవలన చెట్లు వేర్లు త్వరగా కుళ్లిపోయి క్షీణిస్తాయన్నారు. చీనీచెట్లు దెబ్బతినకుండా ఉండాలంటే రోజుకు 60 లీటర్లకు మించి నీరు ఉండకూడదన్నారు. అలాగే చీనీ చెట్లలో పొలుసు పురుగు, బంక తెగులు ఎక్కువగా ఉండటంవల్ల చెట్లు త్వరగా చనిపోతాయన్నారు. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ మల్లేశ్వరరెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కక్షలు మానండి

పెండ్లిమర్రి : గ్రామాల్లో చిన్న, చిన్న సమస్యలకు గొడవ పడి జీవితాలను నాశనం చేసుకోకుండా ప్రతి ఒక్కరు కక్షలు మానుకొని ఆత్మీయంగా జీవిస్తూ బిడ్డల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని రూరల్ సీఐ చల్లని దొర తెలిపారు. బుధవారం రాత్రి చెన్నంరాజుపల్లెలో ఫ్యాక్షన్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ మేలు కొలుపు నాటక ప్రదర్శ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కక్షలకు దూరంగా ఉండి ప్రశాంత జీవితాన్ని గడపాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కళాజాత బృందం సభ్యులు ఫ్యాక్షన్ వల్లన కలిగే అనర్థాల గురించి ప్రజలకు నాటక ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, నాటక బృందం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

చాపాడు : ఖరీఫ్‌లో వరి పంట సాగు చేసుకునే రైతులు నారుమడుల సాగులో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేపట్టాలని మండల వ్యవసాయాధికారి దీపిపద్మలత తెలిపారు. మండలంలోని కుచ్చుపాప, అనంతపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ వరి సాగులో విత్తన శుద్ధి చేపట్టడం వలన పంట పెరుగుదల బాగుంటుందని, పైరు చీడ పీడలను తట్టుకుంటుందన్నారు.

పాలకొండ క్షేత్రంలో శ్రావణ మాసోత్సవాలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగర శివార్లలోని పాలకొండ క్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాసులు, ఆలయ కమిటీ చైర్మన్ బి.రెడ్డెయ్య తెలిపారు. శ్రావణ శనివారాల్లో భక్తులు భారీ సంఖ్యలో శ్రీ పాలకొండ్రాయస్వామిని దర్శించుకుంటారు గనుక ఎవరూ ఇబ్బందులకు గురి కాకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అన్నదానం, ప్రసాదాలు, తాగునీటి సౌకర్యం, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ నిర్వహిస్తామన్నారు. బాల వికాస్ హైస్కూలు యాజమాన్యం కడప నగరం నుంచి పాలకొండ క్షేత్రానికి శ్రీవారి ఉచిత బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. శ్రావణమాస ఉత్సవాలను పురస్కరించుకుని రెవెన్యూ, పోలీసు, అటవీ, నగర పాలక సంస్థ అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశారన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి మొదటి శనివారం, ఆగస్టు 2న రెండవ శనివారం, 9న మూడవ శనివారం, 16న నాల్గవ శనివారం, 23న ఐదవ శనివారాల్లో విశేష పూజలు నిర్వహిస్తారన్నారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఆగస్టు 9న శ్రీ లక్ష్మి పాలకొండరాయస్వామి వారి కల్యాణోత్సవం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామన్నారు. స్వామి దర్శనానికి తరలివచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలియజేశారు.

తిరుమలేష్...నోటిని అదుపులో ఉంచుకొని మాట్లాడు

– వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త

కడప కార్పొరేషన్: టీఎన్ఎస్ఎఫ్ నాయకుడినని చెప్పి విద్యాసంస్థల యాజమాన్యాల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడిన తిరుమలేష్ .. నోటిని అదుపులో ఉంచుకొని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2013 నుంచి తాను వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగంలో పనిచేస్తూ జిల్లా అధ్యక్షుడిని అయ్యానన్నారు. తిరుమలేష్ లాగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారలేదన్నారు. తాను ఒకే నాయకుడు, ఒకే పార్టీని నమ్ముకున్నామన్నారు. సాక్షిలో అసత్యాలు రాశారని తిరుమలేష్ చెప్పాడని, అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఈనాడులో కూడా వార్త వచ్చిందన్నారు. దీనికేం సమాధానం చెబుతావో చెప్పాలన్నారు. తిరుమలేష్ ఎలాంటి వ్యక్తో స్వంత పార్టీ నాయకులనే విచారించుకోవాలన్నారు. నగర అధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవి పేరు చెప్పి జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల నుంచి అక్రమ వసూళ్లు చేశాడని, అది కాస్తా బయట పడటంతో ఏం చేయాలో వారికి దిక్కుతోచడం లేదన్నారు. తాము కూడా తిరుమలేష్ కంటే ఎక్కువే మాట్లాడగలమని, సభ్యత, సంస్కారం అడ్డు వచ్చి ఆగిపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి నాయకులు సందీప్‌రెడ్డి, జబ్బార్, నౌమన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయిదత్త

కూటమి పార్టీల కుట్ర వల్లే మిథున్ రెడ్డి అరెస్ట్

కడప కార్పొరేషన్: కూటమి పార్టీల కుట్రల వల్లే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులు, ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షులు కల్లూరి చెంగయ్య విమర్శించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను వైఎస్సార్ కడప జిల్లాకు ఎస్సీ విభాగ పరిశీలకులుగా నియమించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు మితిమీరిన హామీలు ఇచ్చిన కూటమి నేతలు...ఇప్పుడు వాటిని నెరవేర్చే శక్తి, యుక్తి లేకనే ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని, డిగ్రీ చదివిన నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని, రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామని హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసగిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి 13 నెలలైనా ప్రజల్లోకి పోలేక, ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక...రోజు రోజుకూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలను నిలువరించలేకే ఈ అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. చేయని తప్పులకు కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారని, దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలు వీటిని వ్యతిరేకిస్తున్నారన్నారు. జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీలకు ఒక్క రుణం ఇవ్వలేదని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యదర్శి సుబ్బరాయుడు, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, రవి, అజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులు కల్లూరి చెంగయ్య

ఉచిత న్యాయ సహాయం సద్వినియోగం చేసుకోండి

బద్వేలు అర్బన్ : సబ్‌జైలులో అవసరమైన ఖైదీలు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌జైలును బుధవారం సందర్శించిన ఆయన జైలు పరిసరాలను, వసతిగదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించి అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను సబ్‌జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలను, ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ఖైదీలు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, కోర్టు సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు, సబ్‌జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతోనే వైఎస్సార్ సీపీ ప్రయాణం

కమలాపురం : అధికారంలో ఉన్నా, లేక పోయినా వైఎస్సార్‌సీపీ ప్రయాణం ప్రజలతోనేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని ఎర్రగుడిపాడు గ్రామంలో వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ రీకాలింగ్ చంద్రబాబుస్ మెనిఫెస్టో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో వెలసి ఉన్న వైఎస్సార్ నిలయంలోని మహానేత వైఎస్సార్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు మెనిఫెస్టోను గుర్తుకు తెస్తూ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అంటూ ఇంటింటికి తిరిగి గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను ఆయన ప్రజలకు వివరించారు. గతంలో పింఛన్, రేషన్ అన్ని ఇంటికే వచ్చేవన్నారు. ఇపుడు రేషన్ తెచ్చుకోవాలంటే కిలోమీటర్ల కొద్ది నడవాల్సి ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా, ఆరోగ్య భరోసా, రైతు భరోసా, జగనన్న తోడు తదితర పథకాలన్నీ వచ్చేవన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 మాసాలు అవుతోందని, సీఎం చంద్రబాబు దాదాపు రూ.2లక్షల కోట్లు అప్పు చేశారని, సూపర్ సిక్స్‌లో ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా? అని ప్రజలను అడగగా చంద్రబాబు మాటలకు మోసపోయామని మహిళలు అన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లికి వందనం అరకొరగానే వచ్చిందని, అదీ కూడా వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరాటాల ద్వారానే మంజూరు చేశారన్నారు. ఆడబిడ్డ నిధి ఏమైందని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపై కేసు పెట్టి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, గంగాధర్ రెడ్డి, గండి భాస్కర్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఇస్మాయిల్, సాదిక్, సుధాకొండారెడ్డి, సత్యంరెడ్డి, దేవదానం, జిలానీ బాషా, జెట్టి నగేష్, మునీంద్రారెడ్డి, రాజారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగుడిపాడులో ప్రజలతో మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి

వల్లూరు (చెన్నూరు) : కొండపేటలో బుధవారం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ నరేన్ రామాంజులరెడ్డి పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం సూపర్ ఫెయిల్యూర్ అయ్యిందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, నేతలు మాసీమబాబు, దిలీప్‌రెడ్డి, సురేష్‌యాదవ్, తుంగ చంద్ర యాదవ్, నారాయణరెడ్డి, ఎంపీటీసీలు నాగిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, చంద్ర, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, భాగ్యమ్మ, రవీంద్రారెడ్డి, చిన్నబాబు పాల్గొన్నారు.



నగర పాలక సంస్థ సమీపంలో రోడ్డు దుస్థితి



ఓల్డ్ రిమ్స్ వద్ద రోడ్డు దుస్థితి

గతుకుల రోడ్లతో తప్పని తిప్పలు

కడప నగరంలోని పలు ప్రాంతాలలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని చోట్ల గతుకులమయంగా మారాయి. దీంతో ఆ మార్గాలలో వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలకు పంక్చర్ అవుతున్న సందర్భాలు ఉన్నాయని ప్రజలు అంటున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్ , కడప

In the court of the principal Senior Civil Judge,KADAPA.
EP No. 270/2016 OS No.379/2011

G.Naga Subba Reddy, S/o. G. Ramasubba Reddy, Hindu, aged about 60 years, Employee, residing at M.I.G.H No. 15-31-2M-56-5/6, 3rd Phase, Kokatpalli, Rangareddy (District) **D.Hr/Plaintiff**

Vs

1) **P. Sreenivasulu** having died his L.Rs.
2) **P. Nirmala, W/o Late P.Sreenivasulu,** Hindu, aged about 54 years, Home maker
3) **P. Ashok, S/o. Late P. Sreenivasulu,** Hindu, aged about 32 years
4) **P. Shiva, S/o. Late P. Sreenivasulu,** Hindu, aged about 29 years, All are residing at D.No.4/33, Duvvantaharampalli, Gollapalli (post), Ontimitta (Mandal) Kadapa (District). **J.Dr's/ Defendants**

నోటీసు

పై. E.P/ పిటీషను నందు D.Hr E.P. Schedule దాఖలు ఆస్తి వేలం వేయుటకు గాను దాఖలు చేసియున్నారు. రాజశ్రీ కోర్టు వారి ఆదేశం మేరకు రెస్పాండెంట్ / J.D.r వారసులు అయిన మీకు క్రింద కనబరచిన ఆస్తిని వేలం వేయుటకు గాను ఏమైనా అక్షేపణలు వున్న యెడల తెలియజేయుటకు గాను 30-07-2025 వ తేదీన వాయిదా యుంటు యున్నది. కావున మీరు 30-07-2025 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు మీరు స్వయముగా గానీ, వకీలు ద్వారా గాని మీ అక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

SCHEDULE

Kadapa District, Kadapa Sub-District, Kadapa Municipal Corporation Area, Ceionpuram, D.No. 3/1378, and 3/1379 in S.No. 279/1of Nagarajupalli village fields in an extent of A.C. 0.03 cents bounded by, **EAST:** House of Aparajana **WEST:** House of K. Veera Nara simha Raju, **SOUTH:** public Road **NORTH:** House of third parties In between these boundaries **EAST-WEST** : 20 feet, **NORTH-SOUTH:** 40 feet, Total extent of site and house 195.2Sq. Yards.

By Order of the Court

T. Mohan Krishna, D. Aravindh, R. Sree Kanth
Advocates, KADAPA.